సాక్షి
కాకినాడ
శుక్రవారం । 18 । జూలై । 2025



స్వల్పంగా వచ్చే వరద మంచిదే!

స్వల్పంగా వచ్చే వరదకు రైతులు, లంక గ్రామాల్లో ఉద్యాన పంటలు సాగు చేసేవారు, మత్స్యకారులు సంబర పడతారంటే అతిశయోక్తి కాదు.

8లో



రూ.2.12 లక్షల విరాళం

మామిడికుదురు: అప్పనపల్లి శ్రీ బాలబాలాజీ స్వామి నిత్యాన్నదాన ట్రస్టుకు భారత చైతన్య యువజన పార్టీ అధినేత బోడె రామచంద్ర యాదవ్ రూ.2,11,999 విరాళం అందజేశారు.

36వేల క్యూసెక్కుల విడుదల



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి 36,154 క్యూసెక్కుల మిగులు జలాలను సముద్రం లోకి విడుదల చేశారు. ధవళేశ్వరం వద్ద గురువారం సాయంత్రం 10.90 అడుగులకు నీటి మట్టం చేరింది. డెల్టా కాలువలకు సంబంధించి 14,800 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు.

న్యూస్‌రీల్

మరిడమ్మ దర్శనానికి భారీగా భక్తులు



ఆలయంలో బారులు తీరిన భక్తులు



మరిడమ్మ అమ్మవారు

పెద్దాపురం: భక్తుల కల్పవల్లిగా ఖ్యాతికెక్కిన పెద్దాపురం మరిడమ్మ అమ్మవారి జాతర ఘనంగా జరుగుతోంది. ఈ ఉత్సవాల్లో భాగంగా అమ్మవారిని దర్శించుకునేందుకు సుదూర ప్రాంతాల నుంచి భక్తులు గురువారం అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఆలయం వద్ద భారీ క్యూ లైన్లలో బారులు తీరి మరీ అమ్మవారిని దర్శించుకున్నారు. ముడుపులు, మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ ట్రస్టీ చింతపల్లి శ్రీహర్ష, అసిస్టెంట్ కమిషనర్ కె.విజయలక్ష్మి ఆధ్వర్యాన సిబ్బంది ఏర్పాట్లు చేశారు. పోలీసులు భారీ బందోబస్తు నిర్వహించారు. స్థానిక స్వచ్ఛంద సంఘాల ఆధ్వర్యాన భక్తులకు పులిహోర పంపిణీ చేశారు.

ఈగల్ క్లబ్‌లు ఏర్పాటు చేయాలి



ఈగల్ క్లబ్‌ల ఏర్పాటుపై మాట్లాడుతున్న కలెక్టర్

కాకినాడ సిటీ: మత్తు పదార్థాల వాడకం వలన కలిగే అనర్థాలపై విద్యార్థుల్లో అవగాహన, చైతన్యం పెంపొందించేలా జిల్లాలోని అన్ని విద్యా సంస్థల్లోనూ ఈగల్ క్లబ్‌లు ఏర్పాటు చేయాలని కలెక్టర్ షణ్మోహన్ అధికారులను ఆదేశించారు. ఎంఈఓలు, ప్రధానోపాధ్యాయులతో కలెక్టరేట్‌లో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మాదక ద్రవ్యాలు, గంజాయి వంటి వాటి వాడకం, అమ్మకం, రవాణాను అరికట్టేందుకు ఎలైట్ యాంటీ నార్కోటిక్స్ గ్రూప్ ఫర్ లా ఎన్‌ఫోర్స్‌మెంట్ (ఈగల్) టీమ్ అనే కొత్త వ్యవస్థను ఏర్పాటు చేసిందని వివరించారు. ఈ టీమ్ మత్తు పదార్థాలు వాడే వారిపై ప్రత్యేకంగా దృష్టి సారిస్తుందన్నారు. ప్రతి పాఠశాలలో 8 మంది విద్యార్థులు, ఇద్దరు ఉపాధ్యాయులతో ఈగల్ క్లబ్‌లు తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని ఆదేశించారు. సమావేశంలో జిల్లా ఎస్పీ బిందుమాధవ్, జిల్లా విద్యాశాఖాధికారి పి.రమేష్, ఎస్ఎస్ఏ పీఓ వేణుగోపాలరావు, ఈగల్ టీమ్ అధికారి కె.ధర్మతేజ తదితరులు పాల్గొన్నారు.


1.03 లక్షల మందిని అక్షరాస్యులను చేయాలి

కాకినాడ సిటీ: అక్షరాస్యత కార్యక్రమాల్లో అధికారులందరూ భాగస్వాములు కావాలని జిల్లా కలెక్టర్ షణ్మోహన్ అన్నారు. వయోజన విద్యా శాఖ ఆధ్వర్యాన కలెక్టరేట్‌లో నిర్వహించిన సమన్వయ సమావేశంలో ఆయన మాట్లాడారు. 2023లో నిర్వహించిన క్యాస్ట్ సర్వే ద్వారా జిల్లాలో 3,39,963 మంది వయోజనులైన నిరక్షరాస్యులను గుర్తించారన్నారు. వారిలో మొదటి విడతగా ఈ ఏడాది 1,03,081 మందిని అక్షరాస్యులుగా చేయడానికి ఆయా శాఖల ద్వారా కార్యాచరణ ప్రణాళిక తయారు చేయాలని ఆదేశించారు. తదుపరి మూడు సంవత్సరాల్లో మిగిలిన అందరినీ అక్షరాస్యులుగా చేయాలని సూచించారు. జిల్లా వయోజన విద్య నోడల్ అధికారి అనిశెట్టి వెంకటరావురెడ్డి మాట్లాడుతూ, రెండో దఫా అక్షరాంధ్ర అక్షరాస్యత కార్యక్రమం కింద ప్రతి పది మందికి ఒక వలంటీర్ టీచర్‌ని ఏర్పాటు చేసి, ఈ నెల 25 నుంచి 28వ తేదీ వరకూ ఒక రోజు జిల్లా స్థాయి శిక్షణ నిర్వహిస్తామని వివరించారు. ఈ నెల 29 నుంచి ఆగస్టు 6 వరకూ మండల స్థాయిలో వలంటీర్ టీచర్లు, రిసోర్స్ పర్సన్లకు ఎంపీడీఓల ఆధ్వర్యాన శిక్షణ నిర్వహిస్తామన్నారు. ఆగస్టు 7 నుంచి వచ్చే ఏడాది ఫిబ్రవరి వరకూ నిరక్షరాస్యులకు ఫైనాన్షియల్, డిజిటల్, ఫంక్షనల్ లిటరసీల్లో శిక్షణ ఇచ్చి, మార్చి నెలలో పరీక్ష నిర్వహిస్తామని వివరించారు. సమావేశంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ అనుబంధ విభాగాల్లో చోటు

బోట్‌క్లబ్ (కాకినాడ సిటీ): వైఎస్సార్ సీపీ అనుబంధ విభాగాల్లో జిల్లా నుంచి ముగ్గురికి స్థానం కల్పించారు. పార్టీ వైఎస్సార్ టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా జల్లిగంపల ప్రభాకర్ (ప్రత్తిపాడు నియోజకవర్గం), రాష్ట్ర మహిళా విభాగ కార్యదర్శులుగా అల్లవరపు నాగమల్లేశ్వరి, పచ్చిమళ్ల జ్యోతి అప్పలరాజులను (పిఠాపురం నియోజకవర్గం నియమించారు.

నకిలీలీలలు



- శానిటేషన్ కాంట్రాక్టర్ చీటింగ్‌తో రత్నగిరిపై ప్రకంపనలు
- 'సాక్షి' కథనంతో బయటపడుతున్న టెండర్ లొసుగులు
- వివరణ కోరిన దేవదాయ మంత్రి

సాక్షి ఇంపాక్ట్

అన్నవరం: సత్యదేవుని సన్నిధిలో శానిటేషన్ కాంట్రాక్టర్ ప్రావిడెంట్ ఫండ్ (పీఎఫ్) నకిలీ రసీదుల వ్యవహారం ప్రకంపనలు సృష్టిస్తోంది. వరుసగా మూడు నెలల పాటు పీఎఫ్ చెల్లిస్తున్నట్లు రూ.30 లక్షలకు నకిలీ రశీదులు సృష్టించి, నెలకు రూ.59 లక్షల చొప్పున కాంట్రాక్టర్ రూ.1.77 కోట్లకు శానిటేషన్ బిల్లు చేయించుకున్నా.. ఏ స్థాయిలోనూ అధికారులు కనిపెట్టలేకపోవడంపై సర్వత్రా ఆశ్చర్యం వ్యక్తమవుతోంది. ఇది అధికారుల నిర్లక్ష్యమా.. అవగాహనా లోపమా.. లేక లాలూచీ వ్యవహారమా అనేది అర్థం కావడం లేదు. ఈ నకి'లీలల'పై 'అన్నవరంలో శానిటరీ కాంట్రాక్టర్ మోసం' శీర్షికన 'సాక్షి' దినపత్రిక గురువారం ప్రచురించిన వార్తకు రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి స్పందించారు. దీనిపై నివేదిక ఇవ్వాలని ఆదేశించారు.

టెండర్ పిలవకుండా..

సాధారణంగా దేవస్థానాల్లో ఏ పనికైనా టెండర్ పిలవడమో లేక నాలుగైదు సంస్థల నుంచి కొటేషన్లు స్వీకరించి వాటిలో తక్కువకు కోట్ చేసిన సంస్థకు కాంట్రాక్ట్ అప్పగిస్తారు. అయితే, అన్నవరం దేవస్థానంలో శానిటేషన్ టెండర్‌ను మాత్రం విజయవాడకు చెందిన కనకదుర్గా మ్యాన్‌పవర్ సర్వీసెస్‌కు అప్పగించాలని దేవదాయ శాఖ కమిషనర్ కె.రామచంద్ర మోహన్‌కు ఈఓ వీర్ల సుబ్బారావు నివేదిక పంపగా.. ఆయన ఆమోదం తెలిపారు. 350 మంది శానిటేషన్ సిబ్బందిని దేవస్థానంలో వివిధ చోట్ల నియమించి, వారికి ప్రతి నెలా 25 శాతం పీఎఫ్‌తో కలిపి నెలకు రూ.59 లక్షల బిల్లు చెల్లించేలా, నెలకు రూ.12 లక్షల శానిటరీ మెటీరియల్‌ను దేవస్థానం ఇచ్చేలా ఆదేశాలు జారీ చేశారు. సాధారణంగా దేవస్థానంలో చిన్న కాంట్రాక్ట్ అప్పగించినా అంచనా మొత్తంలో దాదాపు 15 శాతం డిపాజిట్‌గా జమ చేయాల్సి ఉంటుంది. కానీ, కనకదుర్గా మ్యాన్‌పవర్ సర్వీసెస్ నుంచి ఒక్క రూపాయి కూడా డిపాజిట్ రూపంలో తీసుకోకుండా ఈ బాధ్యతలు అప్పగించడం విచిత్రం. అప్పట్లోనే దీనిపై విమర్శలు రాగా, ఒక నెల తాత్కాలిక అడ్జస్ట్‌మెంట్ అని, ఏప్రిల్‌లో కొత్త కాంట్రాక్టర్ వస్తారని అధికారులు సమాధానం చెప్పారు.

అధికారుల నిర్లక్ష్యమే అలుసుగా..

దేవస్థానం అధికారుల నిర్లక్ష్యాన్ని అలుసుగా తీసుకున్న కనకదుర్గా మ్యాన్‌పవర్ సర్వీసెస్ నిర్వాహకులు నకిలీ పీఎఫ్ చలానాలు సృష్టించారు. వరుసగా మార్చి, ఏప్రిల్, మే నెలలకు రూ.10.09 లక్షలు, రూ.10.64 లక్షలు, రూ.10.45 లక్షలకు చలానాలు సృష్టించి దేవస్థానానికి జమ చేసి, బిల్లు చేయించుకున్నారు. మొత్తం 350 మంది సిబ్బంది జీతాలకు నెలకు రూ.59 లక్షల చొప్పున మూడు నెలలకు కలిపి దేవస్థానం రూ.1.77 కోట్ల మేర బిల్లులు చెల్లించింది. అయితే, తమ ఖాతాలకు పీఎఫ్ మొత్తం జమ కాకపోవడంపై శానిటేషన్ సిబ్బంది ఆరా తీశారు. దీంతో, అనుమానం వచ్చిన దేవస్థానం అధికారులు.. సంబంధిత కాంట్రాక్టర్‌ను నిలదీశారు. విధి లేని పరిస్థితిలో ఆ కాంట్రాక్టర్ మార్చి, ఏప్రిల్, మే నెలలకు సంబంధించి ఈ నెల 9, 14, 15 తేదీల్లో రూ.10.09 లక్షలు, రూ.9.90 లక్షలు, రూ.9.75 లక్షల చొప్పున పీఎఫ్‌కు చెల్లించి, ఆ రశీదులు గత మంగళవారం జమ చేశారు. దీంతో పాత రశీదులు ఫేక్ అని ఆ కాంట్రాక్టరే స్వయంగా అంగీకరించినట్లయింది. అయితే, ఆ పాత రశీదుల క్యూఆర్ కోడ్‌లు స్కాన్ చేయగా.. అవి గతంలో వేరే సంస్థ తరఫున చెల్లించిన పీఎఫ్ చలానాలని, వాటి తేదీలు, మొత్తం, టీఆర్ నంబర్ మార్ఫింగ్ చేశారని తేలింది. ఆ కాంట్రాక్టర్ మూడు నెలలకు పీఎఫ్ తిరిగి చెల్లించి, రశీదులు ఇవ్వడంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. ఒకవేళ అలా చెల్లించకపోయినా దేవస్థానం చేసేదేమీ లేదు. ఆ కాంట్రాక్టర్ దేవస్థానం వద్ద ఒక్క రూపాయి కూడా డిపాజిట్ చేయకపోవడమే దీనికి కారణం.

ఆ రసీదు కూడా నకిలీయేనా !

ఇంత జరిగినా గత నెలకు కూడా పీఎఫ్ రసీదు నకిలీదే జమ చేశారు. దానిని ఈ నెల 12న జీతాల బిల్లుతో పాటు దేవస్థానానికి పంపించారు. కాంట్రాక్టర్ ఇచ్చిన రసీదులోని క్యూఆర్ కోడ్ స్కాన్ చేస్తే వచ్చిన సమాచారానికి అసలు పొంతనే లేదు. టీఆర్ నంబర్, నెల కూడా తేడాగా ఉన్నాయి. దీంతో ఇది కూడా నకిలీ అనే భావిస్తున్నారు. శానిటేషన్ కాంట్రాక్టర్ నిర్వాకాలపై గతంలో 'సాక్షి' అనేక కథనాలు ప్రచురించింది. ఏప్రిల్ 25న 'మాకు జీతాలు ఎప్పుడిస్తారు?' శీర్షికన ప్రచురించిన కథనానికి స్పందించి మార్చి నెల జీతాలు చెల్లించారు. అలాగే, ఏప్రిల్ జీతాల చెల్లించకపోవడంతో 'వీరి కష్టం తుడిచేవారేరి' శీర్షికన మే 28న కథనం ప్రచురించగా జూన్ 3న చెల్లించారు. మే నెల జీతాలివ్వకపోవడంతో 'వేతనాల ఆలస్యం రివాజే' శీర్షికన జూన్ 19న వార్త ప్రచురించాక చెల్లించారు. జూన్ నెల జీతాలు ఇంకా చెల్లించనేలేదు. వేతనాల చెల్లింపు ఆలస్యమైతే పీఎఫ్‌పై పెద్దగా దృష్టి ఉండదని, అందువల్ల నకిలీ చలానాలు జమ చేసినా పట్టించుకోరనే అభిప్రాయంతోనే ఆవిధంగా చేస్తున్నట్లు ఉద్యోగులు ఆరోపిస్తున్నారు.

పీఎఫ్ రసీదులు పరిశీలిస్తున్నాం

కాంట్రాక్టర్ అందజేసిన పీఎఫ్ రసీదులను వెరిఫై చేయిస్తున్నాం. అదే విధంగా ప్రావిడెంట్ ఫండ్ కమిషనర్, లేబర్ కమిషనర్ కార్యాలయ సిబ్బందిని పంపించాలని కూడా జిల్లా కలెక్టర్‌ను కోరాం. వారు కూడా ఆ రశీదులు పరిశీలిస్తారు. ఒకవేళ ఆ రసీదులు నకిలీవని తేలితే ఆ కాంట్రాక్టర్‌ను విధుల నుంచి తప్పించే విషయమై ఉన్నతాధికారులతో మాట్లాడి నిర్ణయిస్తాం. చట్టపరమైన చర్యలు కూడా తీసుకుంటాం.

– వీర్ల సుబ్బారావు, ఈఓ, అన్నవరం దేవస్థానం



Payment Confirmation Receipt

గత నెలలో ఇచ్చిన పీఎఫ్ ఫేక్ రశీదు

'జలగ'ండపై అప్రమత్తంగా ఉండాలి



మెట్ట జలగలు సోకిన పత్తి పంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

సాక్షి ఇంపాక్ట్

పిఠాపురం: వాణిజ్య పంటలపై దాడి చేస్తున్న మెట్ట జలగల పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలని శాస్త్రవేత్తలు డాక్టర్ సీతారామశర్మ, డాక్టర్ రామభద్రరాజు సూచించారు. గొల్లప్రోలు మండలంలో వాణిజ్య పంటలపై మెట్ట జలగలు దాడి చేస్తున్నాయంటూ ఈ నెల 13న 'జలగండం' శీర్షికన 'సాక్షి' ప్రచురించిన కథనానికి అధికారులు స్పందించారు. ఈ మేరకు గొల్లప్రోలు మండలం తాటిపర్తిలో గురువారం పర్యటించారు. మెట్ట జలగలు సోకిన పత్తి, మొక్కజొన్న పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు, మాట్లాడుతూ మెట్ట జలగలు ఎక్కువగా ఉంటే ఎకరాకు రెండు కేజీల ఉప్పు వాటి శరీరంపై పడేటట్లు జల్లాలన్నారు. ఉధృతి మరీ అధికంగా ఉంటే వ్యవసాయ అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. జలగల నివారణకు రసాయన మందులు అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని స్థానిక వ్యవసాయ అధికారులకు సూచించారు. రైతులు సిఫారసు చేసిన మోతాదులో మాత్రమే నత్రజని ఎరువు వాడుకోవాలన్నారు. పొటాష్ కూడా వేస్తే పంటలో వ్యాధి నిరోధక శక్తి పెరిగి, గింజ నాణ్యత బాగుంటుందని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ ఏడీఏ స్వాతి, వ్యవసాయ అధికారి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

15 వేల హెక్టార్లలో వరి నాట్లు



రైతులతో మాట్లాడుతున్న జేడీఏ

కరప: ప్రస్తుత ఖరీఫ్‌లో జిల్లావ్యాప్తంగా 93,500 హెక్టార్లలో వరి సాగు జరుగుతూండగా ఇప్పటి వరకూ 15 వేల హెక్టార్లలో నాట్లు పడ్డాయని జిల్లా వ్యవసాయాధికారి ఎస్.విజయ్ కుమార్ తెలిపారు. ఇందులో 6 వేల హెక్టార్లలో వెదజల్లు పద్ధతి అనుసరించామన్నారు. మరో నాలుగైదు రోజుల్లో 40 వేల ఎకరాల్లో నాట్లు పూర్తి చేయడానికి వరి నారు సిద్ధంగా ఉందని తెలిపారు. శివారు ప్రాంతాల్లో సాగునీటి సరఫరాను పరిశీలించేందుకు గురువారం ఆయన మండలంలో పర్యటించారు. ఈ సందర్భంగా స్థానిక రైతు సేవా కేంద్రం వద్ద విలేకర్లతో మాట్లాడారు. సాగునీటి ఎద్దడి లేని కరప, కాజులూరు, తాళ్లరేవు, పెదపూడి, సామర్లకోట, ఏలేశ్వరం మండలాల్లో వరి నాట్లు తొందరగా పూర్తి చేసేలా రైతులను ప్రోత్సహిస్తున్నామని వివరించారు. ఎంటీయూ–7029 (స్వర్ణ), ఎంటీయూ–1318 రకాలను ఎక్కువగా సాగు చేస్తున్నారన్నారు. అవసరం మేరకే రైతులు ఎరువులు వాడాలని సూచించారు. నాట్లు పూర్తి చేసే సమయానికి మొదటి దఫాగా ఎకరానికి 25 కిలోల డీఏపీ, 10 కిలోల యూరియా, 10 కిలోల పొటాష్ వేస్తే సరిపోతుందన్నారు. ఈ సీజన్‌లో 48 వేల మెట్రిక్ టన్నుల ఎరువులు అవసరమవుతాయని, ఇప్పటి వరకూ 18 వేల మెట్రిక్ టన్నులు సరఫరా చేశామని తెలిపారు. మరో 18 వేల టన్నుల ఎరువులను మార్క్‌ఫెడ్ ద్వారా అందుబాటులో ఉంచామన్నారు. ఎవరైనా ప్రైవేటు డీలర్లు కృత్రిమ కొరత సృష్టించినా, పురుగు మందులు కొంటేనే ఎరువులిస్తామని చెప్పినా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జిల్లాకు 42 డ్రోన్లు మంజూరయ్యాయని విజయ్ కుమార్ తెలిపారు. 36 గ్రూపులు సొమ్ము చెల్లించగా, 31 గ్రూపులకు డ్రోన్లు సరఫరా చేశామని తెలిపారు. 69 వేల మందికి కౌలు గుర్తింపు కార్డులు ఇవ్వాల్సి ఉండగా.. ఇంతవరకూ 25 వేల మందికే ఇచ్చామన్నారు. అనంతరం కరప శివారు పేపకాయల పాలెంలో విజయ్ కుమార్ పర్యటించి పొలాలు, పంట కాలువల పరిస్థితిని పరిశీలించారు. సాగునీటి సమస్య ఉంటే తమ సిబ్బందికి తెలియజేయాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో మార్క్‌ఫెడ్ జిల్లా మేనేజర్ ఐ.మంజు, కరప, కాకినాడ ఏడీఏలు కె.బాబూరావు, కె.దుర్గాలక్ష్మి, ఏఈఓ ప్రశాంత్ కూడా పాల్గొన్నారు.

పెత్తందార్ల కోసమే చంద్రబాబు పాలన

- పేదల కోసం కాదు
- ఆయన నిర్లక్ష్యంతోనే పోలవరం ప్రాజెక్ట్ ఎత్తు తగ్గింపు
- మాజీ మంత్రి దాడిశెట్టి రాజా



సమావేశంలో మాట్లాడుతున్న దాడిశెట్టి రాజా

తొండంగి: ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడి పాలన పేదల కోసం కాదని, 'పచ్చ' మీడియాతో పాటు వందిమాగధులు, పెత్తందార్ల అభివృద్ధి కోసమేనని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి దాడిశెట్టి రాజా అన్నారు. బాబు ష్యూరిటీ.. మోసం గ్యారంటీ కార్యక్రమంపై తొండంగిలో గురువారం జరిగిన పార్టీ మండల విస్తృత స్థాయి సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, గత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఐదేళ్ల పాలనలో రూ.3.32 లక్షల కోట్లు మాత్రమే అప్పు చేశారని, పేదలకు నవరత్నాలతో పాటు అనేక సంక్షేమ పథకాలు అమలు చేసి, పేదలకు అందించారన్నారు. 2024లో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వ పాలనలో చంద్రబాబు కేవలం ఏడాది కాలంలోనే దాదాపు రూ.1.72 లక్షల కోట్ల అప్పులు చేశారని చెప్పారు. అయినప్పటికీ రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన హామీ ప్రకారం సూపర్ సిక్స్‌తో పాటు 143 వరకూ సంక్షేమ పథకాలు అమలు చేయలేదని విమర్శించారు.

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో పోలవరం ప్రాజెక్టు పనులను 50 శాతం మేర జగన్ పూర్తి చేశారని దాడిశెట్టి రాజా చెప్పారు. ప్రాజెక్టు ఎత్తు 45.75 మీటర్లకు నిర్మాణ పనులు జరగ్గా.. చంద్రబాబు కేంద్రం వద్ద మాట్లాడకపోవడంతో దీనిని 41.15 మీటర్లకు తగ్గించారని అన్నారు. పోలవరం ప్రాజెక్టు ఎత్తు తగ్గడం వల్ల లక్షలాది మంది ఆయకట్టు రైతులకు తీరని నష్టం జరుగుతుందన్నారు. కేంద్ర ప్రభుత్వం నుంచి రూ.15 వేల కోట్లు అధికంగా తెస్తే ప్రాజెక్టును పూర్తి స్థాయి ఎత్తులో నిర్మించవచ్చని వివరించారు.

కేంద్రానికి టీడీపీ ఎంపీల మద్దతు అవసరం ఉన్నందున దీనిపై ఒత్తిడి తేవాలని రాజా డిమాండ్ చేశారు. పోలవరం పూర్తి కాకపోతే బనకచర్ల ప్రాజెక్టు కట్టినా ఉపయోగం లేదన్నారు. ఎక్కడో బిహార్‌లో ఎన్నికలు జరుగుతూంటే కేంద్రం లక్ష కోట్ల రూపాయల ప్యాకేజీ ఇస్తోందని అన్నారు. బనకచర్ల ప్రాజెక్టుపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చంద్రబాబు కమీషన్ల కోసం మాట్లాడుకున్నారని ఎద్దేవా చేశారు. చంద్రబాబు తన అనుభవంతో కేంద్రానికి తలవంచకుండా రాష్ట్ర ప్రజల భవిష్యత్తు కోసం పోలవరం ప్రాజెక్టు విషయంలోను, ప్రత్యేక హోదా సాధనకు కృషి చేయాలని రాజా సూచించారు. ఈ సమావేశంలో వైఎస్సార్ సీపీ నేత యనమల కృష్ణుడు, పార్టీ పంచాయతీరాజ్ విభాగం కార్యదర్శి కొయ్యా మురళి, ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా పరిషత్ వైస్ చైర్‌పర్సన్ మేరుగు పద్మలత, రాష్ట్ర పెరిక కార్పొరేషన్ మాజీ చైర్మన్ పురుషోత్తం గంగాభవాని, పార్టీ మండల కన్వీనర్ బత్తుల వీరబాబు, వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి, వైస్ ఎంపీపీ నాగం గంగబాబు తదితరులు పాల్గొన్నారు.

సీఎస్ఈకే క్రేజ్..!



- ఇంజినీరింగ్ కోర్సుల్లో కంప్యూటర్ సైన్స్‌దే పైచేయి
- సాఫ్ట్‌వేర్ రంగంలో డిమాండ్ ఉండటంతో విద్యార్థుల మొగ్గు
- సొమ్ము చేసుకోవడానికి రంగంలోకి దిగిన ప్రైవేటు కళాశాలలు
- కౌన్సెలింగ్ జరుగుతుండగానే విద్యార్థులను ఆకర్షించే యత్నాలు
- మేనేజ్‌మెంట్ సీట్ల భర్తీకి బేరసారాలు
- 70 శాతానికి పైగా సీఎస్సీ కోర్సు ఎంచుకునే అవకాశం

ఇంజినీరింగ్‌లో కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్ (సీఎస్ఈ, అనుబంధ బ్రాంచ్‌ల) జైత్రయాత్ర కొనసాగుతూనే ఉంది. కళాశాలల్లో ఏటా ఈ బ్రాంచి సీట్లే ఎక్కువగా భర్తీ అవుతున్నాయి. సాఫ్ట్‌వేర్ రంగంలో ఉద్యోగావకాశాలు ఉండటంతో ఎక్కువ మంది సీఎస్ఈపై మక్కువ చూపుతున్నారు. ప్రముఖ కంపెనీల్లో కొలువు సాధిస్తే రూ.లక్షల్లో ప్యాకేజీలు ఉంటాయన్న ఆశతో సీఎస్ఈ బ్రాంచ్‌పై ఆసక్తి పెంచుకుంటున్నారు. ప్రస్తుతం ఆ కోర్సులో చేరేందుకు అత్యధిక శాతం విద్యార్థులు వెబ్ ఆప్షన్లను ఎంచుకుంటున్నారు. ఆ తర్వాత ఏఐ, డేటా సైన్స్, ఎంఎల్ తదితర కోర్సులకు డిమాండ్ ఉంది. ఇదే అదనుగా భావిస్తున్న ప్రైవేటు కళాశాలల యాజమాన్యాలు సొమ్ము చేసుకుంటున్నాయి. మేనేజ్‌మెంట్ సీట్ల పరిమితి లేకపోవడంతో ఇష్టారాజ్యంగా సీట్లు పెంచుకునే పనిలో నిమగ్నమయ్యాయి.

సాక్షి, రాజమహేంద్రవరం: ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా వ్యాప్తంగా ఇంజినీరింగ్ అడ్మిషన్ల ప్రక్రియ మొదలైంది. విద్యార్థులు, తల్లిదండ్రులు వెబ్ ఆప్షన్ల నమోదులో తలమునకలవుతున్నారు. ఏపీఈఏపీ సెట్–2025 వెబ్ ఆప్షన్ల ప్రక్రియ ఈ నెల 19వ తేదీ వరకూ జరగనుంది. 22న సీట్ల అలాట్‌మెంట్, 23న కళాశాలలో చేరిక, వచ్చే నెల 4న క్లాసులు ప్రారంభం కానున్నాయి. ఉత్తమ ర్యాంకులు పొందిన విద్యార్థులు సీఎస్ఈ గ్రూప్‌నకే తమ వెబ్ ఆప్షన్లలో తొలి ప్రాధాన్యం ఇచ్చారు. రెండో ప్రాధాన్యంగా ఈసీఈ, ఏఐ కోర్సును ఎంచుకుంటున్నారు. ఒకప్పుడు తిరుగులేని గ్రూపులుగా వెలుగొందిన ఈఈఈ, మెకానికల్, సివిల్, కెమికల్ ఇంజినీరింగ్ కోర్సులకు ఆదరణ తగ్గిపోయింది. కనీసం ఈ బ్రాంచ్‌లను పది శాతం మంది కూడా ఎంచుకోవడం లేదంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం అవుతోంది. ఈ నెల 19న జరిగే వెబ్ ఆప్షన్ల మార్పుల్లో సైతం ఇదే పంథా కొనసాగనుంది. దీన్ని బట్టి చూస్తే ఈ ఏడాది సెట్‌లో అర్హత సాధించిన విద్యార్థులకు ఈఈఈ, మెకానికల్, సివిల్, కెమికల్ ఇంజినీరింగ్ బ్రాంచ్‌లలో కన్వీనర్ కోటాలో ఏదో ఒక కళాశాలలో సీటు పక్కాగా లభించే అవకాశం ఉంది.

కొత్త కోర్సులు

ఇంజినీరింగ్‌లో ప్రస్తుతం కొత్త కోర్సులు పరిచయం అయ్యాయి. సీఎస్ఈలో ఏఐ, మెషీన్ లెర్నింగ్, డేటా సైన్స్, రోబోటిక్స్, సైబర్ సెక్యూరిటీ, వీఎల్ఎస్ఐ డిజైన్, అడ్వాన్స్‌డ్ కమ్యూనికేషన్ టెక్నాలజీ, ఏరోస్పేస్, అగ్రికల్చర్, మెరైన్, మైనింగ్, స్కిల్ అండ్ టెక్స్‌టైల్ వంటి కొత్త బ్రాంచ్‌లు అందుబాటులోకి తీసుకొచ్చారు.

యథేచ్ఛగా దోపిడీ

సీఎస్ఈకి ఉన్న డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకొని కొన్ని ఇంజినీరింగ్ కళాశాలల యాజమాన్యాలు దోపిడీకి తెర తీశాయన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రైవేటు, కార్పొరేట్, డీమ్డ్, అటానమస్ ఇలా అన్ని ప్రైవేటు కళాశాలల్లో సీఎస్ఈ కన్వీనర్ కోటా సీట్లు తప్ప మేనేజ్‌మెంట్, పేమెంట్ సీట్లను పూర్తి స్థాయిలో ఇప్పటికే విక్రయించేశారు. ఏఐసీటీఈ గతేడాది సీట్ల పరిమితిపై ఉన్న సీలింగ్ ఎత్తివేయడంతో ప్రైవేటు యాజమాన్యాలు ఇష్టారాజ్యంగా తమ కళాశాలల్లో డిమాండ్ ఉన్న కోర్సులకు సీట్లు పెంచుకుంటున్నాయి. కళాశాల స్థాయి, పేరు ఆధారంగా ఒక్కో కోర్సుకు ఏడాదికి సుమారు రూ.3 లక్షల నుంచి రూ.5 లక్షల వరకూ వసూలు చేస్తున్నట్లు సమాచారం. దీనిపై ప్రశ్నిస్తే సీటు ఇవ్వకుండా తిరస్కరిస్తారేమోనన్న భయంతో తల్లిదండ్రులు కూడా అడిగినంత ఫీజు చెల్లించేందుకు సిద్ధమవుతున్నారు. ఇంత జరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదన్న ఆరోపణలున్నాయి.

సీఎస్ఈ అంటున్నారు..

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా వ్యాప్తంగా 34 ఇంజినీరింగ్ కళాశాలలున్నాయి. అందులో ప్రభుత్వ 2, ప్రైవేటు 32 ఉన్నాయి. 15,222 మంది సెట్‌లో అర్హత సాధించారు. 17,250 ఇంజినీరింగ్ సీట్లు ఉన్నాయి. వీటిలో 75 శాతానికి పైగా సీఎస్ఈనే ఎంచుకునే పరిస్థితి ఉందని విద్యా నిపుణులు అంటున్నారు. ఉపాధి, ఉద్యోగావకాశాలు అధికంగా ఉండటంతో సీఎస్ఈ గ్రూప్‌నే ఎక్కువగా ఎంచుకుంటున్నారు. ఇందులో ప్రధానంగా సీఎస్ఈ జనరల్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డేటా సైన్స్, మెషీన్ లెర్నింగ్, సైబర్ సెక్యూరిటీ, బ్లాక్‌చైన్ టెక్నాలజీ, క్లౌడ్ టెక్నాలజీ వంటి కోర్సుల హవా కొనసాగుతోంది.


ఉమ్మడి తూర్పులో ఇలా...

ఇంజినీరింగ్ కళాశాలలు	:	34
ప్రభుత్వ	:	2
ప్రైవేటు	:	32
మొత్తం సీట్లు	:	17,250
సెట్‌లో అర్హత సాధించిన విద్యార్థులు	:	15,222

కన్వీనర్ కోటాకే పథకాల వర్తింపు

కోర్సుల ఎంపికలో తల్లిదండ్రులు, విద్యార్థులు జాగ్రత్తలు పాటించాలని నిపుణులు సూచిస్తున్నారు. కన్వీనర్ కోటాలో సీట్లు పొందిన విద్యార్థులకు ప్రభుత్వ పథకాలు వర్తిస్తాయంటున్నారు. అన్ని బ్రాంచిలూ ముఖ్యమైనవేనని, విద్యార్థుల అభీష్టం మేరకు కోర్సుల్లో చేరాలంటున్నారు.

కళాశాలల దోపిడీని అరికట్టాలి



ఇంజినీరింగ్ మేనేజ్‌మెంట్ సీట్ల భర్తీలో ప్రైవేటు కళాశాలలు దోపిడీ బహిరంగంగా కొనసాగుతోంది. ఇంత జరుగుతున్నా వర్శిటీ అధికారులు, ప్రభుత్వం, ఉన్నత విద్యాశాఖ పట్టించుకోవడం లేదు. విద్యార్థులు తీవ్రంగా నష్టపోతున్నారు. ప్రైవేటు కళాశాలలకు సీట్ల కేటాయింపు విచ్చలవిడిగా పెంచడంతో ఇదే అదునుగా భావిస్తున్న కళాశాలలు.. విద్యార్థుల నుంచి రూ.లక్షలు దండుకుంటున్నాయి.

– ఎంవీ బ్రహ్మానందరెడ్డి, ఏపీటీపీఐఈఏ రాష్ట్ర అధ్యక్షుడు

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో డ్రైవర్ మృతి

పెరవలి: మండలంలోని ఖండవల్లి వద్ద గురువారం తెల్లవారు జామున జాతీయ రహదారిపై జరిగిన ప్రమాదంలో ఓ వ్యక్తి మృతిచెందాడు. పెరవలి ఎస్సై ఎం.వెంకటేశ్వరరావు తెల్పిన వివరాలిలా ఉన్నాయి. ఆచంట మండలం వల్లూరు గ్రామానికి చెందిన నార్కిమెల్లి వెంకటేశ్వరరావు (42) మెటల్ తీసుకురావటానికి ట్రాక్టర్‌పై బయలుదేరి ఖండవల్లి సెంటర్‌కు వచ్చాడు. అక్కడ వేగ నియంత్రణ కోసం ఏర్పాటు చేసిన ఐరన్ డ్రమ్ములను తప్పించబోయి సడన్ బ్రేక్ వేయటంతో రోడ్డుపై పడ్డాడు. ఆ సమయంలో ట్రాక్టర్ వేగంగా పక్కకు తిరిగి ట్రక్కు చక్రాలు అతనిపై నుంచి వెళ్లటంతో అక్కడికక్కడే మృతి చెందాడు. భార్య వెంకట లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని, మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం తణుకు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించామని తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై వెంకటేశ్వరరావు తెలిపారు.

యాచకులను ఢీకొట్టిన బైకు

తొండంగి: జాతీయ రహదారిపై మండలంలోని బెండపూడి వద్ద గురువారం జరిగిన ప్రమాదంలో యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల తెలిపిన వివరాల ప్రకారం గోపాలపట్నంకు చెందిన యువకుడు ఆంజనేయులు మరో యువకునితో బైకుపై కత్తిపూడి వైపు వెళ్తున్నారు. బెండపూడి వద్ద జాతీయ రహదారిపై ఆర్చి జంక్షన్‌కు సమీపానికి వచ్చేసరికి రోడ్డు దాటుతున్న యాచకులను ఢీకొన్నారు. దీంతో బైకు అదుపుతప్పి పడిపోవడంతో ఆంజనేయులకు కాలువిరగడంతోపాటు గాయాలయ్యాయి. దీంతో స్థానికులు 108 అంబులెన్స్‌కు సమాచారం అందించారు. దీంతో అంబులెన్స్ సిబ్బంది ఈఎంటీ సూర్య, పైలెట్ అప్పారావు క్షతగాత్రులకు ప్రథమ చికిత్స అందించి తుని ఏరియా ఆస్పత్రికి తరలించారు. దీనిపై తొండంగి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

స్వల్పంగా వచ్చే వరద మంచిదే!

- పంట చేలు, లంక తోటలకు ఎర్ర నీరు
- పొలాలు, ఉద్యానాలకు మేలు



గోదావరి లంకల్లోని తోటల్లోకి చేరిన వరద నీరు

ఐ.పోలవరం: గోదావరికి వరద అంటే ఎవరైనా భయపడతారు. మరీ ముఖ్యంగా కోనసీమ జిల్లా వాసులకు నిద్రాహారాలు ఉండవు. ఉప్పెనలా వచ్చిపడే వరద లంక గ్రామాలను, పంట భూములను ముంచెత్తుతోంది. వందల మంది రైతులకు నష్టాలను మిగులుస్తోంది. వరదల వల్ల లంకవాసులు పడే ఇబ్బందులు అన్నీ ఇన్నీ కావు. అయితే స్వల్పంగా వచ్చే వరదకు రైతులు, లంక గ్రామాల్లో ఉద్యాన పంటలు సాగు చేసేవారు, మత్స్యకారులు సంబర పడతారంటే అతిశయోక్తి కాదు. గోదావరికి వరద వచ్చి తగ్గుముఖం పట్టింది. అత్యధికంగా ఈ నెల 13వ తేదీన 7.29 లక్షల క్యూసెక్కుల వరద నీరు ధవళేశ్వరం బ్యారేజీ నుంచి దిగువకు విడుదల చేశారు. తరువాత నుంచి వరద క్రమేపీ తగ్గుముఖం పట్టింది. బుధవారం ఉదయం ఆరు గంటల సమయంలో 1,76,676 క్యూసెక్కులకు తగ్గింది. వరద వచ్చి తగ్గుముఖం పట్టడంతో స్థానికులు ఊపిరిపీల్చుకున్నారు.

మేలు చేసే ఒండ్రు మట్టి

గోదావరి వరదల సమయంలో ఎగువ నుంచి వచ్చే ఎర్రనీరుతోపాటు ఒండ్రుమట్టి కొట్టుకు వస్తుంది. ఇది కాలువల ద్వారా పంట చేలు, తోటలకు చేరుతుంది. ఎగువ కొండ ప్రాంతాలు, అటవీ ప్రాంతాల నుంచి వచ్చే నీరు పలు రకాలుగా మంచిది. కొండల మీద పడే వర్షాల నుంచి వచ్చే నీటిలో మినరల్స్, న్యూట్రినైట్స్ ఉంటాయి.





వరద నీరు (ఎర్ర నీరు) చేరిన చేలల్లో నాట్లు వేస్తున్న కూలీలు, గోదావరి పులసలు

అటవీ ప్రాంతాల నుంచి వచ్చే నీటిలో కూడా వనమూలికలు, హ్యూమస్ (జంతు కళేబరాల అవశేషాల నుంచి వచ్చే కర్బనం), సూక్ష్మ పోషకాలు అధికం. పంట పొలాలు, తోటల్లో నీరు చేరిన తరువాత దానిలో ఉన్న ఒండ్రు అర అడుగు మేర భూమిపై పేరుకుపోతుంది. గోదావరి లంకల్లో అయితే అడుగు మేర ఒండ్రు మట్టి చేరుతుంది. డెల్టా కాలువల నుంచి చేలకు నేరుగా వరద వస్తుంది. గోదావరి నదీపాయల నుంచి విడిపోయే కౌశికలు, అప్పర కౌశికలు, తొగరపాయ, తుల్యభాగ వంటి డ్రెయిన్లలోకి వరద నీరు వచ్చి చేరుతుంది. కొబ్బరి, అరటి, కోకో వంటి ఉద్యాన పంటలకు, డెల్టాలో పంటలకు ఈ నీటిని పెద్ద ఎత్తున తోడడం ద్వారా రైతులు తమ చేలు, తోటలకు ప్రకృతి సిద్ధమైన సూక్ష్మ పోషకాలు, మినరల్స్, న్యూట్రినైట్స్ అందిస్తున్నారు.

పులసలొచ్చేది ఇప్పుడే

మాంసాహార ప్రియులకు నోరూరించే గోదావరి జలపుష్పం పులస చేప దొరికేది కూడా గోదావరికి ఎర్రనీరు వచ్చినప్పుడే. బంగ్లాదేశ్, కోల్‌కతా, ఒడిశా వంటి ప్రాంతాల్లో సముద్రంలో హిల్స్ (విలస) నిత్యం దొరుకుతుంది. ఇటీవల కాలంలో గోదావరి జిల్లాతోపాటు హైదరాబాద్, విజయవాడ వంటి ప్రాంతాల్లో ఏడాది పొడవునా ఈ చేప దొరుకుతూనే ఉంటోంది. స్థానికంగా కూడా సముద్ర వేట సమయంలో విలసలు పెద్ద ఎత్తున దొరుకుతుంటాయి. కాని అసలైన పులస దొరికేది మాత్రం గోదావరికి ఎర్రనీరు తాకినప్పుడే. సాధారణ రోజుల్లో దొరికే విలస చేప కేజీ రూ.500 నుంచి రూ.వెయ్యి వరకు మాత్రమే ఉంటుంది. అదే గోదావరికి ఎర్రనీరు తాకిన తరువాత దొరికే పులస ఖరీదు రూ.15 వేల నుంచి రూ.30 వేల వరకు ధర ఉంటుంది. అందుకే గోదావరికి ఎర్రనీరు తగిలి పులస దొరికితే చాలని మత్స్యకారులు ఎదురుతెన్నులు చూస్తున్నారు.

నీటికి ఎదురీదుతూ ఒక్కసారి గోదావరి నీటిలోకి వచ్చిన తరువాత దీని రుచి మారిపోతుంది. ఎర్రనీటిలో వీటిని పట్టుకోవడానికి మత్స్యకారులు పోటీ పడుతుంటారు. ఆస్ట్రేలియా, న్యూజిల్యాండ్, టాంజానియా వంటి ప్రాంతాల్లో జీవించే ఈ చేపలు సంతానోత్పత్తి కోసం ఖండాలు దాటి ప్రయాణిస్తాయి. హిందూ మహాసముద్రం మీదుగా బంగాళాఖాతంలోకి ప్రవేశించి అక్కడి నుంచి అంతర్వేది గుండా గోదావరి నది నీటిలోకి చేరతాయి. గోదావరి నది చాలా వేగంగా ప్రవహిస్తుంటుంది. ఆ ప్రవాహాన్ని తట్టుకోవడమే కాకుండా దానికి ఎదురీదుకుంటూ రావడం పులస చేప ప్రత్యేకత. వీటి వలసలు జూన్ నుంచి ఆగస్టు మధ్య ఉంటాయి. గుడ్లు పెట్టి అవి పిల్లలు అయిన తర్వాత అక్టోబర్ మాసానికి చేపలన్నీ తిరిగి సముద్రంలోకి చేరుకుంటాయి. ఇలా గుడ్లను పొదగడానికి వచ్చిన సమయంలో మత్స్యకారుల వలలో పడతాయి ఈ చేపలు. వలలో పడిన వెంటనే పులస చనిపోతుంది. గోదావరి వరద నీటిలోకి వచ్చిన తరువాత దీని రంగు మారుతుంది. దాంతో పాటు గోదావరి తీపి నీటి కారణంగానే వాటి రుచి కూడా మారి పులసగా అవతరిస్తుంది. అయితే గోదావరి అంతటా పులసలు దొరుకుతాయని అనుకోవడం భ్రమే. కేవలం ధవళేశ్వరం బ్యారేజీ నుంచి సముద్రంలోకి గోదావరి కలిసే ప్రాంతంలో మాత్రమే ఇవి లభిస్తాయి. వీటికి ఇంతటి డిమాండ్ ఉండటానికి ఇది కూడా కారణం.



బొబ్బర్లంక - ముక్తేశ్వరం కాలువలో పరవళ్లు తొక్కుతున్న గోదావరి వరద (ఎర్ర) నీరు

ప్రియురాలిని హత్య చేసి పరారీ

అడ్డు వచ్చిన ఆమె తల్లి, అన్నపై దాడి



పుష్ప మృతదేహం



పుష్ప, షమ్మా (ఫైల్)

రాజోలు: చెడు వ్యసనాలకు బానిసైన యువకుడు తనతో సహజీవనం చేస్తున్న ప్రియురాలిని మద్యం మత్తులో చాకుతో పొడిచి హత్య చేశాడు. బుధవారం రాత్రి బి.సావరం సిద్ధార్థనగర్‌లో ఈ ఘటన చోటు చేసుకుంది. ప్రియురాలిని వ్యభిచారం చేయాలని ఒత్తిడి చేయగా దానికి ఆమె నిరాకరించింది. దీంతో వారి ఇద్దరి మధ్య గొడవ జరిగింది. ఈ గొడవలో ప్రియురాలు ఓలేటి పుష్ప(22)ను ప్రియుడు రాజోలు కోళ్ల వారి వీధికి చెందిన షేక్ షమ్మా చాకుతో గుండెల్లో పొడిచాడు. దీంతో పుష్ప ప్రాణాలు కోల్పోయింది. కూతురిని కాపాడుకునేందుకు పుష్ప తల్లి గంగ, పుష్ప అన్న వినయ్ అడ్డువెళ్లగా వారిద్దరిపై కూడా షేక్ షమ్మా చాకుతో దాడి చేసి గాయపర్చాడు. వారి కేకలకు చుట్టుపక్కల వారు రావడంతో నిందితుడు షమ్మా అక్కడి నుంచి పారిపోయాడు. సిద్ధార్థనగర్‌లో జరిగిన హత్య విషయం స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో రాజోలు సీఐ నరేష్‌కుమార్, ఎస్సై రాజేష్‌కుమార్ ఘటనా స్థలానికి చేరుకున్నారు. నిందితుడు దాడిలో గాయపడ్డ తల్లి గంగ, అన్న వినయ్‌లను రాజోలు ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

సీఐ నరేష్‌కుమార్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పశ్చిమగోదావరి జిల్లా నర్సాపురం మండలం యెనుముల్లంక గ్రామానికి చెందిన ఓలేటి పుష్పకు ఐదేళ్ల క్రితం రాజోలు మేకలపాలానికి చెందిన ఓలేటి సతీష్‌తో వివాహమైంది. వీరికి నాలుగేళ్ల బాబు ఉన్నాడు. భార్యాభర్తల మధ్య మనస్పర్థలు రావడంతో పెద్దల సమక్షంలో విడాకులు తీసుకున్నారు. అప్పటి నుంచి తన నాలుగేళ్ల కుమారుడితో పుష్ప, ఆమె తల్లి అంగాని గంగతో కలసి బి.సావరం సిద్ధార్థనగర్‌లో నివాసం ఉంటోంది. రెండేళ్ల క్రితం నుంచి రాజోలు కోళ్లవారి వీధికి చెందిన షమ్మాతో పుష్పకు పరిచయం ఏర్పడింది. అప్పటి నుంచి వారు సహజీవనం చేస్తున్నారు. మద్యానికి బానిసైన షమ్మా తన అవసరాల కోసం పుష్పను శారీరకంగా, మానసికంగా వేధించేవాడని, డబ్బు కోసం వ్యభిచారం చేయాలని ఒత్తిడి చేస్తున్నాడని పుష్ప తన తల్లి గంగ, అన్న వినయ్‌కు మొర పెట్టుకుంది. ఆ విషయాన్ని కుటుంబ సభ్యులకు ఎందుకు చెప్పావంటూ పుష్పతో గొడవపడి చాకుతో పొడవడంతో ఆమె అక్కడికక్కడే ప్రాణాలు విడిచింది. తల్లి గంగ ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు. డీఎస్పీ సుంకర మురళీమోహన్ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. పారిపోయిన షమ్మాను పట్టుకునేందుకు రెండు బృందాలను ఏర్పాటు చేశామని డీఎస్పీ తెలిపారు.

చోరీ కేసులో ఇద్దరి అరెస్టు

సీతానగరం: రఘుదేవపురం రవీంద్ర కాలనీ సురవరపు మణికంఠ ఇంటిలో జరిగిన చోరీ కేసులో ఇద్దరు ముద్దాయిలను అరెస్ట్ చేశామని నార్త్‌జోన్ డీఎస్పీ వై శ్రీకాంత్ తెలిపారు. గురువారం సీతానగరం పోలీస్ స్టేషన్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కోరుకొండ సీఐ సత్యకిషోర్, సీతానగరం ఎస్సై డి.రామ్‌కుమార్ సిబ్బందితో కలిసి ముగ్గళ్ళ గోదావరి మాత విగ్రహం వద్ద మధ్యాహ్నం 3 గంటలకు నీలంశెట్టి వెంకటవాసు (రవీంద్రకాలనీ), రాజానగరానికి చెందిన గొడ్డు భాను శివశంకర్‌లను అదుపులోకి తీసుకున్నారని తెలిపారు. మణికంఠ అక్క శివ కుమారి నిడదవోలులో ఉంటున్నారు. తల్లితో కలిసి మణికంఠ అక్క ఇంటికి వెళ్లి తిరిగి ఈ నెల 12న ఇంటికి వచ్చాడు. తలుపులు తెరచి ఉండటంతో లోపలకి వెళ్లి చూడగా బీరువా లాకర్ బద్దలుకొట్టి ఉంది. అందులోని నాలుగు కాసుల బంగారు, 70 తులాల వెండి, పూజా గదిలో దాచిన రూ.1.50 లక్షల నగదు పోయిందని గుర్తించి ఫిర్యాదు చేశారు. ముద్దాయిల నుంచి మూడు గ్రాముల విలువ ఉన్న ఉంగరం, 750 గ్రాముల వెండి వస్తువులు, రూ.1.50 లక్షల నగదు రికవరీ చేశామని తెలిపారు. దొంగతనానికి ఉపయోగించిన మోటారు సైకిల్ సీజ్ చేశామన్నారు. ముద్దాయిలను రాజమహేంద్రవరం సెవంత్ అడిషనల్ జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ (ఏజేఎఫ్‌సీఎమ్) కోర్టులో హాజరుపర్చగా రిమాండ్ విధించారని నార్త్‌జోన్ డీఎస్పీ శ్రీకాంత్ తెలిపారు.



ముద్దాయిలు, స్వాధీనం చేసుకున్న ఆభరణాలు, నగదు, మోటారు సైకిల్‌తో నార్త్‌జోన్ డీఎస్పీ శ్రీకాంత్, సీఐ సత్యకిషోర్, ఎస్సై రామ్‌కుమార్

ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య



రౌతులపూడి: మండల కేంద్రమైన రౌతులపూడిలో లోకారపు చిన్న అప్పలనాయుడు (79) ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా వున్నాయి. రౌతులపూడి గ్రామానికి చెందిన మృతుడు లోకారపు చిన్న అప్పలనాయుడుకు గత 20 ఏళ్లుగా ఆయాసం, కడుపునొప్పి, గుండె సంబంధిత వ్యాధులతో బాధపడుతున్నాడు. రెండురోజుల క్రితం ఆయాసంగా వుందని చెప్పగా అన్న కొడుకు అయిన లోకారపు దేవుడు స్థానికంగావున్న సీహెచ్‌సీకి తీసుకువెళ్లి జాయిన్ చేశాడు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. గురువారం ఉదయం ఆరు గంటలకు సిబ్బంది లేచి చూసేసరికి ఆసుపత్రి ఆవరణలోవున్న మామిడి చెట్టుకు ఆతని లుంగీ, టవల్‌తో ఉరి వేసుకుని చెట్టుకింద పడిపోయి మృతిచెందినట్లు గుర్తించారు. దీంతో స్థానిక పోలీస్‌స్టేషన్‌కు ఫిర్యాదు చేయగా ఎస్సై వెంకటేశ్వరరావు తన సిబ్బందితో కలసి మృతదేహాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం తుని ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తామని ఎస్సై తెలిపారు.

అయోమయంలో 7వ తరగతి విద్యార్థిని

- గురుకుల పాఠశాలలో సీటు ఇస్తామని పిలిచి ఇప్పుడు తూచ్ అంటున్న ప్రిన్సిపాల్
- ఎస్‌సీ వర్గానికి చెందినదిగా భావించి పొరపాటు పడ్డ సిబ్బంది
- విద్యా సంవత్సరం వృథా అవుతుందన్న ఆందోళనలో కుటుంబ సభ్యులు



సీటు లేదని చెప్పడంతో అయోమయంలో పడ్డ విద్యార్థిని, కుటుంబ సభ్యులు

జగ్గంపేట: స్థానిక గురుకుల పాఠశాలలో సీటు ఇస్తామని పిలిచారని, దీంతో వేరే చోట నుంచి టీసీ, సర్టిఫికెట్లు పట్టుకుని వస్తే సీటు లేదు పొమ్మంటున్నారని గంగవరం మండలం పిడతమామిడి గ్రామానికి చెందిన వాకాడ కుసుమ అర్చన ఆవేదన వెలిబుచ్చింది. జగ్గంపేట గురుకుల పాఠశాలలో సిబ్బంది రిజర్వేషన్ ప్రక్రియను సమగ్రంగా పరిశీలించకుండా వాకాడ కుసుమ అర్చనకు కొద్దిరోజుల క్రితం జగ్గంపేట అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో సీటు ఇస్తామని, వచ్చి కలవాలని ఫోన్ చేశారు. దీంతో ఆమె తల్లి వాకాడ వెంకటలక్ష్మితో కలిసి వచ్చి గురుకుల పాఠశాల ప్రస్తుత ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌ను బుధవారం కలిశారు. అయితే సర్టిఫికెట్లతోపాటు ఎక్కడ చదువుతున్నారో అక్కడ నుంచి టీసీ పట్టుకురావాలని చెప్పడంతో వెళ్లిపోయారు. గోకవరం మండలం మల్లవరంలోని పాఠశాల నుంచి టీసీ, ఇతర సర్టిఫికెట్లు తీసుకుని గురువారం జగ్గంపేటలోని గురుకుల పాఠశాలకు వచ్చారు. అయితే వాకాడ కుసుమ అర్చన బీసీ వర్గానికి చెందినది కావడంతో ఆమెకు సీటు లేదని గురుకుల పాఠశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ కృష్ణవేణి చెప్పడంతో వారు అవాక్కయ్యారు. ఎస్‌సీ వర్గానికి చెందినదిగా భావించి తమ సిబ్బంది పొరపాటున సమాచారం ఇచ్చారని, బీసీ వర్గానికి సీట్లు లేవని ఆమె చెప్పడంతో వాకాడ కుసుమ అర్చన కుటుంబ సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పుడు తమ కుమార్తె విద్యాసంవత్సరం ఏమీ కావాలని వారు ప్రశ్నించారు. అయితే తిరిగి ఎక్కడ చదువుతున్నారో అక్కడికే వెళ్లి జాయిన్ కావాలని కావాలంటే తాము సహకారం అందిస్తామని ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ తెలిపారని వారు మనస్తాపం వ్యక్తం చేశారు.

డొక్కా సీతమ్మ ఐదో తరం వారసుడు భీముడు మృతి



పి.గన్నవరం: నిరతాన్నదాత్రిగా పేరొందిన డొక్కా సీతమ్మ వారి ఐదోతరం వారసుడు, ఎల్.గన్నవరం గ్రామానికి చెందిన డొక్కా భీమ వెంకట సత్య కామేశ్వరరావు (భీముడు) (59) బుధవారం రాత్రి మృతి చెందారు. ఆయన ఎల్.గన్నవరంలో బ్రాంచి పోస్టు మాస్టర్‌గా పనిచేస్తున్నారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. గత కొంతకాలంగా భీముడు అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఆయన పార్థివదేహానికి గురువారం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ తదితరులు పూలమాలలు వేసి, నివాళులు అర్పించారు.

న్యాయం గెలిచింది

తమపై కేసు కొట్టి వేయడంతో వైఎస్సార్ సీపీ నేతల హర్షం

అనపర్తి : అధికారుల విధులకు ఆటంకం కల్పించారంటూ వైఎస్సార్ సీపీ నేతలపై పెట్టిన కేసును కొట్టివేస్తూ అనపర్తి జూనియర్ సివిల్ కోర్టు న్యాయమూర్తి మజ్జి వంశీకృష్ణ గురువారం తీర్పు వెలువరించారు. ఈ తీర్పు పట్ల వైఎస్సార్ సీపీ శ్రేణులు స్పందిస్తూ న్యాయం గెలిచిందంటూ హర్షం వ్యక్తం చేస్తున్నారు.

వివరాల్లోకి వెళితే 2018లో మహేంద్రవాడ గ్రామంలో స్థానిక గుడిమెట్ల వారి గుడి వీధిలో మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహం ఏర్పాటు చేయడానికి స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులు సంకల్పించి సిమెంటు దిమ్మెను నిర్మించామని పోతంశెట్టి శ్రీను తెలిపారు. ఆ దిమ్మెను అప్పటి అధికార తెలుగుదేశం పార్టీ నేతల ఒత్తిడి మేరకు పంచాయతీ అధికారులు తొలగిస్తుంటే అడ్డుకున్న తనతో పాటు వైఎస్సార్ సీపీ నాయకులు కొవ్వూరి ధర్మారెడ్డి, కొవ్వూరి జగ్గారెడ్డి, పడాల ధర్మారెడ్డి, మల్లిడి గంగరాజులపై విధులకు ఆటంకం కలిగించారంటూ పంచాయతీ కార్యదర్శి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు అయిందన్నారు. విచారణ అనంతరం ఈ కేసును కొట్టివేస్తూ న్యాయమూర్తి తీర్పు వెలువరించినట్లు శ్రీనివాసరెడ్డి తెలిపారు. తమ పై అన్యాయంగా మోపిన కేసులో స్థానిక న్యాయవాది మన్మోహన్ శ్రీనివాసరెడ్డి వాదనలు వినిపించారని వారికి ధన్యవాదాలు తెలుపుకుంటున్నామని పోతంశెట్టి శ్రీనివాసరెడ్డి తెలిపారు. కాగా నిందితుల్లో ఒకరైన కొవ్వూరి ధర్మారెడ్డి కేసు నడుస్తుండగానే మృతిచెందారని ఆయన తెలిపారు.

అక్రమంగా ర్యాంపు ఏర్పాటు



ఆత్రేయపురం లంక భూముల్లో అక్రమంగా ఏర్పాటు చేసిన ర్యాంపు

- ఆత్రేయపురంలో భారీగా మట్టి తవ్వకాలకు ప్రయత్నాలు
- అడ్డుకున్న గ్రామస్తులు

కొత్తపేట: ఆత్రేయపురం లంక భూముల్లో అక్రమంగా మట్టి తవ్వకాలు జరిపి, తరలించేందుకు టీడీపీ మట్టి మాఫియా పెద్ద ఎత్తున ప్రయత్నాలు ప్రారంభించింది. దానిలో భాగంగా భారీ ర్యాంపు ఏర్పాటు చేసింది. ఆత్రేయపురంలో అధికారిక ఇసుక ర్యాంపు ఉంది. కాగా చినపేట సమీపాన సొసైటీ భూములు, శ్మశాన దిబ్బలు ఉన్నాయి. వాటి పక్క నుంచి అక్రమంగా ర్యాంపు ఏర్పాటు చేశారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టాక ఆత్రేయపురంలో టీడీపీ నేత ఆగడాలకు అడ్డూ, అదుపు లేకుండా పోయింది. అధికార యంత్రాంగం కూడా వారి ఆగడాలకు కొమ్ము కాస్తూ చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. టీడీపీ అక్రమ వ్యవహారాల్లో భాగంగానే తాజాగా ఆ నాయకుడు ప్రస్తుతం అక్రమ మట్టి తవ్వకాలపై దృష్టి సారించారు. గురువారం యుద్ధప్రాతిపదికన ప్రొక్లెయినర్‌తో పనులు చేపట్టి లంకభూముల్లోకి ర్యాంపును ఏర్పాటు చేస్తూ వెళ్లారు. ట్రాక్టర్లు, లారీల్లో మట్టి తరలింపునకు అనువుగా, అవి దిగబడిపోకుండా కొబ్బరి ఆకులను కూడా ట్రాక్టరుపై తరలించారు. అక్రమంగా ర్యాంపు ఏర్పాటుపై గ్రామస్తులు అధికారులకు ఫిర్యాదు చేశారు. అయితే అధికారులు స్పందించలేదని పలువురు గ్రామస్తులు తెలిపారు. దాంతో గ్రామస్తులే అడ్డుకునే ప్రయత్నం చేశారు. దీంతో ర్యాంపు పనులు నిలిపివేసి యంత్రాలను ఎక్కడివి అక్కడే నిలిపివేశారు. రాత్రి సమయంలో మట్టి రవాణాకు ప్రణాళిక సిద్ధం చేసుకున్నారు. దీనిపై గ్రామస్తులు ఆందోళనకు సిద్ధం కావడంతో ఎట్టకేలకు సాయంత్రం పోలీసులు రంగప్రవేశం చేసి యంత్రాలను, ట్రాక్టర్లను లంక భూముల్లోంచి బయటకు తీసుకువచ్చారు. దీనిపై రెవెన్యూ, పోలీసు అధికారుల వివరణకు ఫోన్‌లో ప్రయత్నించగా వారు స్పందించలేదు.



అక్రమంగా ర్యాంపు ఏర్పాటు చేస్తున్న ప్రొక్లెయిన్, దిగుమతి చేస్తున్న కొబ్బరి ఆకులు

పరిశోధనలతో సమాజానికి మేలు



వర్క్‌షాప్‌ను ప్రారంభిస్తున్న జేఎన్టీయూకే వీసీ

కాకినాడ సిటీ: జేఎన్‌టీయూకే ప్రాంగణంలో ఓక్ ఉత్సవాల్లో భాగంగా రెండు రోజులపాటు నిర్వహించనున్న రోల్ ఆఫ్ నేషనల్ ఎడ్యుకేషన్ పాలసీ-2020 ఇన్ స్వర్ణాంధ్ర అండ్ వికసిత్ భారత్-2047 అనే అంశంపై నిర్వహిస్తున్న వర్క్‌షాప్‌ను గురువారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో న్యాక్ చైర్మన్ అనిల్ సహస్ర బుద్ధే ఆన్‌లైన్ ద్వారా మాట్లాడారు. భారతదేశంలో పూర్వకాలంలో నిర్వహించిన తక్షశిల, నలంద విశ్వవిద్యాలయాల సంస్కృతిని కొనియాడారు. వర్గీస్ కురియన్, స్వామినాథన్, ఎఫ్‌సీ కోహ్లీ వంటి ప్రముఖుల పరిశోధనలు సమాజానికి ఎంతగానో ఉపయోగపడ్డాయని విశదీకరించారు. వికసిత్ భారత్-2047కు విద్యా వ్యవస్థ పటిష్ఠం కావాలని, స్టార్టప్, స్కిల్, మేకిన్, డిజిటల్, క్లీన్ ఇండియా, క్లీన్ ఆంధ్ర, డిజిటల్ లావాదేవీలు మెరుగుపడాలన్నారు. సౌత్ ఏషియన్ యూనివర్శిటీ ప్రెసిడెంట్ కేకే అగర్వాల్, యూజీసీ మాజీ చైర్మన్, ప్రొఫెసర్ వేద్ ప్రకాష్, ఐఐటీ మద్రాస్ ప్రొఫెసర్, యూనివర్శిటీ పూర్వ విద్యార్థి ప్రొఫెసర్ జానకీరామ్ మాట్లాడారు. రోల్ ఆఫ్ ఇండస్ట్రియలిస్ట్ టూ కొలాబొరేట్ విత్ అకడమిక్ ఇనిస్టిట్యూషన్, టు రియలైజ్ ద అబ్జక్టివ్ ఆఫ్ స్వర్ణాంధ్ర అండ్ వికసిత్ భారత్-2047 అనే అంశంపై ప్యానల్ చర్చలు నిర్వహించారు. కలెక్టర్ షణ్మోహన్, కేంద్ర మాజీ మంత్రి పల్లంరాజు, యూనివర్శిటీ ఉపకులపతి సీఎస్ఆర్‌కే ప్రసాద్, ఓక్ ఉత్సవ కమిటీ చైర్మన్ పి.ఉదయభాస్కర్ పాల్గొన్నారు.